అధికారులే ముద్దు!

- మోదీకి వారిపైనే నమ్మకం
- టికెట్ల రేసులో వారే ముందు
- కార్యకర్తలకు దక్కాల్సిన పార్టీ పదవుల్లో కూడా వారిదే హవా
- పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి
- ఏండ్లుగా పార్టీకి సేవ చేస్తున్నా మొండిచేయి చూపడంపై ఆగ్రహం
- ఇది ఐదు రాష్ట్రాల్లో బీజేపీ పరిస్థితి



న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన నేపథ్యంలో టికెట్లను ఆశిస్తున్న బీజేపీ శ్రేణుల ఆశలపై మాజీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు నీళ్లు చల్లుతున్నారు. ఇన్నేండ్లుగా పార్టీ జెండా మోస్తూ ఏనాటికైనా తమకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశలు పెట్టుకున్న నాయకులకు బ్యూరోక్రాట్లు గండి కొడుతున్నారు. నిన్న..మొన్న కాషాయ కండువా కప్పుకున్న మాజీ అధికారులు టికెట్‌లు ఎగరేసుకుపోతున్నారు. పార్టీ అధిష్ఠానం తమను కాదని బ్యూరోక్రాట్ల పట్ల మొగ్గు చూపడం బీజేపీ నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లో 20 మందికి పైగా మాజీ ఐఏఎస్/ఐపీఎస్‌లు బీజేపీలో చేరారు. తమకు మొండిచేయి చూపుతూ అధికారులను అందలమెక్కించడాన్ని బీజేపీ నాయకులు అవమానంగా భావిస్తున్నారు. వీరంతా మూకుమ్మడిగా ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను, కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులుగా ఉన్న సమయంలో వీరు ఎన్నడూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడలేదని, ఇప్పుడు ఎన్నికల ముంగిట టికెట్ల కోసం బారులు దీరుతున్నారని బీజేపీ ఎస్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు జితేంద్ర మీనా మండిపడ్డారు. ఇంతకాలం అధికారాన్ని అనుభవించి ఇప్పుడు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందడం కోసం టికెట్లు ఆశిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని అధికారంలోకి తెచ్చింది బీజేపీ కార్యకర్తలు తప్ప బ్యూరోక్రాట్లు కాదని బీజేపీ రాజస్థాన్ ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. రాజస్థాన్‌లో డజనుమందికి పైగా మాజీ ఐఏఎస్‌లు టికెట్లు ఆశిస్తుండగా.. వారికి అవకాశం కల్పిస్తే పార్టీ శ్రేణులు మూకుమ్మడిగా మరో పార్టీలోకి మారడం ఖాయమని కమలనాథులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది తమ పదవీ కాలం ముగిసిన తరువాత బీజేపీలో చేరగా, కొందరు ఎన్నికల ముంగిట తమ పదవులకు రాజీనామా చేసి కాషాయ కండువా కప్పుకుంటున్నారు.

కీలక శాఖలు వారికే..

ప్రస్తుతం కేంద్ర క్యాబినెట్‌లో పలు కీలక మంత్రి పదవులలో ఉన్నవారు మాజీ ఐఏఎస్‌లే కావడం గమనార్హం. మంత్రి పదవుల్లోనే కాకుండా పార్టీలో పదవులను కూడా వీరు ఆక్రమిస్తుండటం విశేషం. తాజాగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఐపీఎస్ అధికారి కే అన్నామళై నియమితులు కావడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అంతకు ముందు ఓపీ చౌదరి (ఐఏఎస్)ని ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ ప్రధానకార్యదర్శిగా, ఏకే శర్మ (ఐఏఎస్)ను ఉత్తరప్రదేశ్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. పలువురు ఐఏఎస్/ఐపీఎస్‌లు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ అభ్యర్థులుగా పోటీచేశారు.

పాటిస్తారు.. ఎదురు చెప్పరు!

కేంద్రంలో సివిల్ సర్వెంట్ల ప్రభావం నానాటికీ పెచ్చుమీరుతున్నదని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ మంత్రి విమర్శించారు. ఈ ఏడాది జూలైలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఐఏఎస్ అధికారులే ప్రజెంటేషన్ ఇచ్చారని ఉదహరించారు. మా కార్యక్రమాలపై పీఎంఓ నిఘా వేస్తుంది. మేం ఏ కార్యక్రమాల్లో పాల్గొనాలో పీఎంఓలోని అధికారులే నిర్ణయిస్తారు. బ్యూరోక్రాట్లకు ఆదేశాలను అమలు చేయడమే తెలుసు, వారికి ఎదురుచెప్పడం రాదు.. అందుకే మోదీ వారినే ఎక్కువగా నమ్ముతారు. ప్రజలకు హాని చేసే నిర్ణయాలను అమలు చేయడానికి మేమైతే వెనుకడుగు వేస్తాం.. అందుకే ఆయన మమ్మల్ని విశ్వసించరు' అంటూ కుండబద్దలు కొట్టారు.

వార్‌రూమ్ ముందే కాంగ్రెస్ శ్రేణుల నిరసనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: రాజస్థాన్ కాంగ్రెస్‌లో టిక్కెట్ల లొల్లి షురూ అయింది. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వొద్దని రాజస్థాన్ కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీలోని కాంగ్రెస్ వార్ రూమ్ ముందు నిరసనలకు దిగాయి. రాజస్థాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీ పార్టీ అభ్యర్థుల ఎంపిక కోసం సమావేశం నిర్వహిస్తుండగా ఈ నిరసన ప్రదర్శన జరగడం గమనార్హం. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలకు వ్యతిరేకంగా ఇలాంటి కామెంట్లు రావడం అసాధారణమేమీ కాదని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ పేర్కొనడం చర్చనీయాంశమైంది. 'అలాంటి వ్యాఖ్యలు నిజం లేదా అబద్ధం కావొచ్చు. కుట్రలు కూడా ఉండొచ్చు. అంతిమంగా పార్టీ హైకమాండ్ సరైన నిర్ణయం తీసుకొంటుంది. గెలిచే సామర్థ్యం ఉన్నవారికి టికెట్లు ఇస్తుంది. దాన్ని మేమంతా ఆమోదిస్తాం' అని ఆయన తెలిపారు.

సిట్టింగ్‌లను మార్చకపోతే.. గట్టెక్కలేం!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్ ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు పార్టీ అంతర్గత సర్వేల్లో వెల్లడైనట్టు తెలిసింది. ఈ క్రమంలో వారికి ఈసారి టికెట్లు ఇవ్వకూడదని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో గెలువడం కష్టమన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం వచ్చినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. టికెట్ నిరాకరిస్తున్న ఎమ్మెల్యేల జాబితాలో బఘేల్ విశ్వాసపాత్రులు కూడా ఉన్నట్టు సమాచారం. దీంతో అధిష్ఠానంతో చర్చలు జరుపడానికి సీఎం ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 25 మంది సిట్టింగ్‌లకు టికెట్ నిరాకరిస్తే, మూడింట ఒకవంతు కంటే ఎక్కువ మందిని మారుస్తున్నట్టు లెక్క.

40 ఏండ్ల తర్వాత పోలింగ్ బూత్‌లు

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్‌కు సన్నాహాలు

రాయ్‌పూర్: వచ్చే నెల 7, 17 తేదీలలో రెండు విడతలుగా జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ఛత్తీస్‌గఢ్‌లో యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. 90 సీట్లకు జరిగే ఈ ఎన్నికల్లో ఈసారి బస్తర్ జిల్లా ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మావోయిస్టులు ప్రభావం తీవ్రంగా ఉండే ఈ ప్రాంతంలోని 40 గ్రామాల ప్రజలు 40 ఏండ్లలో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అంతకు ముందు ఈ ప్రాంతంలో పోలింగ్ నిర్వహించడం అధికారులకు సాధ్యమయ్యేది కాదు. దీంతో వీరు ఓటింగ్‌కు దూరంగా ఉండేవారు. అయితే ఈసీ ఎన్నికల ప్రకటన చేయగానే తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు మావోయిస్టు గ్రూపులు ప్రకటించాయి. ఎన్నికల సంఘం పూర్తి భద్రతా చర్యలతో ఇక్కడ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు ప్రారంభించింది. దీంతో 40 ఏండ్ల తర్వాత ఇక్కడ పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు ప్రయత్నాలు చకచకా జరుగుతున్నాయి. శనివారం నాటికి ఈ గ్రామాల్లో 120 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాలను సురక్షితంగా మార్చామని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని అధికారులు భరోసా ఇస్తున్నారు.

ముందుగా ఓటేస్తే జిలేబీలు ఫ్రీ

ఇండోర్ ఓటర్లకు బంపరాఫర్

ఇండోర్, అక్టోబర్ 14: నవంబర్ 17న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో త్వరగా ఓటేసే వారికి ఇండోర్‌లోని ప్రముఖ ఫుడ్ హబ్ '56 దుకాణ్' యజమానుల సంఘం బంపర్ ఆఫర్ ప్రకటించింది. తొమ్మిది గంటల లోపు ఓటు వేసి వచ్చిన వారికి ఉచితంగా పోహా, జిలేబీలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు చెప్పింది. ఓటింగ్ శాతంలో తమ నగరం అగ్రస్థానం పొందాలని ఈ ఆఫర్‌ను ఇస్తున్నట్టు 56 దుకాణ్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుంజన్ శర్మ తెలిపారు. తొమ్మిది గంటల తర్వాత ఓటేసి వచ్చిన వారికి ఈ రెండు స్నాక్స్‌ను 10 శాతం రాయితీతో ఇస్తామని ఆయన చెప్పారు.

దరఖాస్తు చేసిన 28 ఏండ్లకు ఉద్యోగం

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ తపాలా శాఖలో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం అంకుర్ గుప్తా 28 ఏండ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. మెరిట్ సాధించినప్పటికీ అంకుర్ గుప్తాను వొకేషనల్ స్ట్రీమ్‌లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణుడయ్యారని ఉద్యోగం ఇవ్వడానికి తపాలా శాఖ నిరాకరించింది. దీంతో 1996లో ఆయన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. 1999లో అంకుర్‌గుప్తాకుఅనుకూలంగా తీర్పు చెప్పింది. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఈ తీర్పును 2000లో అలహాబాద్ హైకోర్టు, అనంతరం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా నెలలోగా పోస్టల్ అసిస్టెంట్‌గా అంకుర్‌ను నియమించాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది.

మండుతున్న అగ్నిగోళం లాంటి సూర్యుడు ఓ ఉంగరం ఆకృతిలోకి మారే అరుదైన సన్నివేశం అమెరికాలోని 8 రాష్ట్రాల్లో శనివారం కనిపించింది. శనివారం ఉదయం 9.13 గంటలకు మొదలైన సంపూర్ణ సూర్యగ్రహణం దాదాపు గంటపాటు కొనసాగింది. ఈ అద్భుత దృశ్యాన్ని లక్షల మంది తిలకించారు.

అమృత్‌పాల్

అగ్నివీరుడికి సాధారణ అంత్యక్రియలు!

న్యూఢిల్లీ: ఆర్మీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన అగ్నివీర్‌కు ఆర్మీ లాంఛనాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అగ్నివీరుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఈ ఘటనే నిదర్శనమని విపక్షాలు తప్పుపట్టాయి. తుపాకీతో కాల్చుకొన్న గాయం వల్ల చనిపోయాడనే కారణంతో ఆర్మీ లాంఛనాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించలేదని ఆర్మీ పేర్కొనడంపై పలువురు మండిపడుతున్నారు. పంజాబ్‌కు చెందిన అమృత్‌పాల్ సింగ్(19) అనుమానాస్పదంగా తుపాకీ పేలి తలకు గాయమవడంతో చనిపోయాడు. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో ఈనెల 10న ఈ విషాదం చోటుచేసుకొంది. ఈ నెల 13న స్వగ్రామంలో అతడి అంత్యక్రియలు నిర్వహించగా.. ఆర్మీ లాంఛనాల ప్రకారం చేయలేదు.

కర్ణాటకలో విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

బళ్లారి, అక్టోబర్ 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో దారుణం చోటుచేసుకొన్నది. ఓ విద్యార్థినిపై నలుగురు కామాంధులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. బీకామ్ విద్యార్థిని పరీక్ష రాస్తుండగా నిందితుల్లో ఒకరు యువతి సోదరుడిని అని చెప్పి ఆమెను బయటకు పిలిచాడు. అనంతరం నిందితులు ఆమెను కిడ్నాప్ చేసి కొప్పల్ జిల్లాలోని సనాపురలో ఉన్న ఓ హోటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ బలవంతంగా ఆమెతో డ్రగ్స్ కలిపిన బీర్ తాగించి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం

అమృత్‌సర్: లష్కరే తోయిబా ఉగ్ర కుట్రను పంజాబ్ పోలీసులు భగ్నం చేశారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన ఇద్దరిని శనివారం అరెస్టు చేశారు. రెండు ఐఈడీలు, గ్రనేడ్లు, ఒక పిస్తోల్‌తో పాటు పలు ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఆపరేషన్‌ను పంజాబ్ రాష్ట్ర పోలీసు శాఖలోని ప్రత్యేక ఆపరేషన్ సెల్, కేంద్ర సంస్థ సంయుక్తంగా చేపట్టాయి. పంజాబ్‌లోని శాంతికి విఘాతం కలిగించేందుకు ఉగ్రవాదులు కుట్ర పన్నారని, దాన్ని అడ్డుకొన్నామని డీజీపీ గౌరవ్ యాదవ్ పేర్కొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ఆగస్ట్ 23

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: చంద్రయాన్-3 చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ అయిన ఆగస్ట్ 23ను జాతీయ అంతరిక్ష దినంగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 'ఈ చారిత్రక ఘట్టాన్ని ఉత్సవంలా జరుపుకోవడానికి ఏటా ఆగస్ట్ 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని భారత ప్రభుత్వం ప్రకటించింది' అని అంతరిక్ష శాఖ శనివారం ప్రకటించింది. రానున్న కాలంలో ఈ చారిత్రక మిషన్ ఫలితాలు మానవాళికి ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపింది. దేశ అంతరిక్ష రంగంలో ఆగస్ట్ 23 కీలక మైలురాయిగా గుర్తుండిపోతుందని పేర్కొంది.

జడ్జీలు దేవుళ్లు కాదు

వాళ్లెదుట చేతులు కట్టుకోవాల్సిన పని లేదు: కేరళ హైకోర్టు

ఎర్నాకుళం: జడ్జీలు దేవుళ్లు కారని, న్యాయవాదులు, కక్షిదారులు వారి ముందు చేతులు కట్టుకొని ఒదిగి ఉండాల్సిన అవసరం లేదని కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక కేస్ విచారణ సందర్భంగా జస్టిస్ కున్హి కృష్ణ ఈ విషయాన్ని పేర్కొన్నారు. వివరాల్లోకెళ్తే.. తన ఇంటికి దగ్గరున్న ప్రార్థనా మందిరం మైక్ వల్ల ఇబ్బంది పడుతున్నట్టు ఒక మహిళ అలప్పుజ్జా ఎస్పీకి 2019లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పరిశీలనను అలప్పుజ్జా ఎస్ఐ నిర్లక్ష్యం చేశారు. దీనిపై ఆమె తిరిగి ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో కక్ష పెంచుకున్న ఎస్ఐ ఆమె తనను ఫోన్‌లో దూషించారంటూ కేసు పెట్టారు. తన కేసును పరిశీలించాలంటూ ఆమె చేతులు జోడించి కన్నీళ్లతో న్యాయమూర్తిని ఆర్థించడంతో ఆయన పై వ్యాఖ్యలు చేస్తూ.. ఆమెపైనున్న కేసు కొట్టివేశారు.

గాజాలోని టన్నెల్ నెట్‌వర్క్

టెర్రర్ టన్నెల్

ఇజ్రాయెల్‌కు సవాల్‌గా గాజాలోని సొరంగాలు

జెరూసలేం, అక్టోబర్ 14: గాజాలో గ్రౌండ్ ఆపరేషన్ చేసేందుకు ఇజ్రాయెల్ దళాలు సన్నద్ధమవుతున్నాయి. అయితే గాజాలో ఉన్న టన్నెల్ నెట్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకొని ఇజ్రాయెల్ ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నదని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సరైన ప్రణాళిక లేకుండా టన్నెళ్లలో ప్రవేశిస్తే ట్రాప్‌లో ఇరుక్కున్నట్టేనని వారు హెచ్చరిస్తున్నారంటేనే అర్థం చేసుకోవచ్చు.. గాజా టన్నెల్ నెట్‌వర్క్ ఎంత భయంకరమైనదో. తమ ఎటాక్ ప్లాన్ కంటే డిఫెన్స్ ప్లానే అత్యంత పటిష్ఠంగా ఉందని హమాస్ పొలిట్‌బ్యూరో డిప్యూటీ చీఫ్ సలేహ్ అల్ అరౌరీ పేర్కొనడమే అందుకు నిదర్శనం.

500 కిలోమీటర్ల నెట్‌వర్క్...

గాజాలో సుమారు 500 కిలోమీటర్ల మేర ఉన్న టన్నెళ్లలో బాంబులు, బందీలను హమాస్ రహస్యంగా ఉంచుతున్నది. వీటి ద్వారానే హమాస్ మిలిటెంట్లు తాజాగా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2006లో సరిహద్దుల కింద ఉన్న సొరంగాల ద్వారా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించిన మిలిటెంట్లు ఇద్దరు సైనికులను హతమార్చారు. సొరంగాల్లో ప్రవేశించిన ఇజ్రాయెల్ సైనికులను హమాస్ ట్రాప్ చేసి హతమారుస్తున్నది. టన్నెళ్లలోకి వెళ్లాక ఎటు వెళ్లాలో అవగాహన లేకపోవడమే ఇజ్రాయెల్‌కు ప్రతికూలంగా మారుతున్నది. టెర్రర్ టన్నెళ్లుగా ఇజ్రాయెల్ పిలుచుకునే వీటిని ధ్వంసం చేయకుండా హమాస్‌ను అంతం చేయడం సవాల్‌గానే చెప్పుకోవచ్చు.

గ్రౌండ్ ఆపరేషన్ షురూ!

- ఇప్పటికే గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం
- సరిహద్దునకు మరిన్ని బలగాలు
- పౌరుల తరలింపునకు కారిడార్లు
- ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ కమాండర్ మురాద్ హతం
- ఆరంభం మాత్రమే: నెతన్యాహు
- హమాస్‌కు మద్దతుగా పోరుకు సిద్ధంగా ఉన్నామన్న హెజ్బొల్లా

గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ధ్వంసమైన భవనాలు

జెరూసలేం, అక్టోబర్ 14: హమాస్ గ్రూపును పూర్తిగా నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ గ్రౌండ్ ఆపరేషన్‌కు సిద్ధమైంది. ఇజ్రాయెల్ బలగాలు ఇప్పటికే శుక్రవారం గాజాలోకి ప్రవేశించాయి. హమాస్ ఆకస్మిక దాడుల అనంతరం ప్రతి దాడులు చేస్తున్న ఇజ్రాయెల్.. ఇప్పుడు భూతల దాడులు ప్రారంభించేందుకు చర్యలు ప్రారంభించింది. గాజా సరిహద్దు వైపునకు మరిన్ని ఇజ్రాయెల్ బలగాలు కదులుతున్నాయి. ఏరియల్ పెట్రోలింగ్ వ్యవస్థను పంపతున్నట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలతో ఉత్తర గాజాలోని వేలాది పాలస్తీనా కుటుంబాలు వలస ప్రారంభించాయి. ఇజ్రాయెల్ సైన్యం వీరి కోసం శనివారం ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వెళ్లిపోయేందుకు రెండు ప్రధాన మార్గాలు ఏర్పాటు చేసింది. ఈ గడువులో ప్రజల దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని సూచించింది. మరోవైపు గాజాలోని విదేశీయులు రఫా సరిహద్దు దాటి ఈజిప్టులోకి ప్రవేశించేందుకు ఈజిప్టు, ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరిందని ఈజిప్టు అధికారి ఒకరు పేర్కొన్నారు.

దాడుల సూత్రధారి హతం

గాజాపై డ్రోన్ దాడుల్లో హమాస్ సీనియర్ కమాండర్ అబు మురాద్ హతమయ్యారని ఇజ్రాయెల్ వెల్లడించింది. మురాద్ హమాస్ ఏరియల్ ఆపరేషన్ల గ్రూపు హెడ్‌గా ఉన్నాడని పేర్కొన్నది. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో రాయిటర్స్ జర్నలిస్టు ఒకరు మరణించగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి.

మూల్యం చెల్లింపు ప్రారంభం

శత్రువులు మూల్యం చెల్లించుకోవడం ప్రారంభమైందని, తర్వాత ఏం జరుగుతుందో మాత్రం బయటకు చెప్పలేనని ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహూ అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనన్నారు. హమాస్ నాశనమే తమ లక్ష్యమని మరోసారి పునరుద్ఘాటించారు.

సరైన సమయంలో యుద్ధానికి సిద్ధం

సరైన సమయంలో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా హమాస్‌తో కలిసి పోరాడేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నామని లెబనాన్ కేంద్రంగా పనిచేసే హెజ్బొల్లా గ్రూపు పేర్కొన్నది.

5,000 దాటిన మరణాలు

యుద్ధంలో 1,500 మంది హమాస్ మిలిటెంట్లు సహా రెండు వైపులా మరణాల సంఖ్య 5 వేలకు పైగా చేరింది. గాజాలో 2,215 మంది పౌరులు మరణించగా, ఇజ్రాయెల్‌లో పలువురు జవాన్లు సహా 1,300 పౌరులు మృతిచెందారు.

ఢిల్లీ చేరుకొన్న రెండో విమానం

ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి 235 మందితో రెండో విమానం శనివారం ఢిల్లీకి చేరింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులపై నిషేధాన్ని ఎయిరిండియా 18 వరకు పొడిగించింది. శిక్షణ నిమిత్తం ఇజ్రాయెల్‌కు వెళ్లిన తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టీ రమేశ్ ఆ దేశంలో చిక్కుకుపోయారని ఆయన భార్య తెలిపారు. ఆయన్ను క్షేమంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

పాఠశాలలో ఉగ్రదాడి.. టీచర్ హత్య

ఫ్రాన్స్‌లో తీవ్ర ఉద్రిక్తత

పారిస్, అక్టోబర్ 14: ఫ్రాన్స్‌లో మరోసారి ఉగ్రదాడి జరిగింది. అర్రాస్ పట్టణంలోని స్కూల్ టీచర్‌పై ఓ ఉగ్రవాది కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనతో మతపరమైన అల్లర్లు చెలరేగేందుకు అవకాశముందన్న అంచనాతో మేక్రాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించింది. అధ్యక్షుడు మేక్రాన్ శనివారం ఘటనా స్థలానికి వెళ్లారు. 'అత్యంత అనాగరికమైన చర్య'గా దాడి ఘటనను ఖండించారు. ఈ ఘటనకు ఇజ్రాయిల్-హమాస్‌కు యుద్ధానికి సంబంధముందని హోంమంత్రి గెరాల్డ్ దర్మానిన్ చెప్పడం గమనార్హం.

కెనడా సూపర్ వీసా నిబంధనలు సడలింపు

వీసా గడువు 10 ఏండ్లకు పెంపు

ఒట్టావా : భారతీయ ఉద్యోగుల కుటుంబసభ్యుల రాకపోకలను సులభతరం చేస్తూ కెనడా సూపర్ వీసా నిబంధనల్ని సులభతరం చేసింది. సూపర్ వీసా గడువును 10 ఏండ్లకు పెంచింది. దీంతో విజిటింగ్ వీసాపై వచ్చి 6 నెలలకోసారి మళ్లీ ఫీజులు కట్టి వీసా గడువు పొడిగించుకునే ఇబ్బంది తప్పింది. పలుమార్లు కెనడాలోకి ప్రవేశం కల్పించే టెంపరరీ రెసిడెంట్ వీసా(టీఆర్‌వీ)నే 'సూపర్ వీసా'గా పేర్కొంటారు. ఈ వీసా ఉన్నవారు అనేకసార్లు కెనడాకి రాకపోకలు సాగించవచ్చు. గతంలో ఈ వీసాతో వచ్చినవారు గరిష్టంగా రెండేండ్ల వరకే ఆ దేశంలో నివాసం ఉండేందుకు అవకాశముంది.

భారత్-శ్రీలంక మధ్య ఫెర్రీ సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: నాలుగు దశాబ్దాల అనంతరం భారత్-శ్రీలంక మధ్య పడవ సేవలు ప్రారంభమయ్యాయి. తమిళనాడులోని నాగపట్టిణం, శ్రీలంకలోని కంకేసంతురై మధ్య నడిచే అంతర్జాతీయ హై స్పీడ్ ప్రయాణికుల ఫెర్రీ సర్వీస్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల దౌత్య ప్రయత్నాలను భారత ప్రధాని మోదీ, శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమసింఘే ప్రశంసించారు.

గర్భాశయ క్యాన్సర్‌ను జయించి మనుగడ

న్యూఢిల్లీ : దేశంలో అనేకమంది గర్భాశయ క్యాన్సర్‌ను ఎదుర్కొని మనుగడ సాగిస్తున్నారని జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ (పీబీసీఆర్) వెల్లడించింది. 2012-2015 మధ్య ఈ వ్యాధి బారిన పడిన వారిలో 52 శాతం మంది దీన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపింది. ప్రస్తుతం వారంతా మనుగడ సాగిస్తున్నారని పేర్కొన్నది. అత్యధిక శాతం మంది మనుగడ సాగిస్తున్న నగరాల్లో అహ్మదాబాద్ (61.5 శాతం), తిరువనంతపురం (58.8 శాతం), కొల్లం (56.1 శాతం) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

కేరళలో సుగంధ ద్రవ్యాల పార్క్

తిరువనంతపురం: సుగంధ ద్రవ్యాలు, అనుబంధ ఉత్పత్తుల ప్రాసెసింగ్, వాటి వ్యాల్యూ యాడెడ్ ప్రోడక్ట్స్ కోసం కేరళలో 'సుగంధ ద్రవ్యాల' పార్క్ ఏర్పాటైంది. ఇడుక్కి జిల్లా తుండాన్గంద వద్ద ఏర్పాటు చేసిన సుగంధ ద్రవ్యాల పార్క్‌ను శనివారం సీఎం విజయన్ ప్రారంభించారు. రూ.20 కోట్లతో 15 ఎకరాల్లో పార్క్ మొదటి దశ నిర్మాణ పనుల్ని కిన్‌ఫ్రా పూర్తి చేసింది. ఈ సందర్భంగా సీఎం విజయన్ మాట్లాడారు. అంతర్జాతీయ ప్రమాణాలు సాధించటంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దృష్టిసారించాలన్నారు.

నైట్ షిఫ్టుల్లో పని ఆరోగ్యానికి చేటు

న్యూఢిల్లీ : రాత్రి షిఫ్టుల్లో పని చేసేవారు అనారోగ్యాల బారిన పడటానికి గల కారణాలను పరిశోధకులు వెల్లడించారు. నిద్రపోవడం-మేల్కొవడం, పగలు-రాత్రి పని వేళలు ఏకరీతిగా లేకపోతే ఆకలి వేయడంలో మార్పులు కనిపిస్తాయని, తద్వారా రోగాల బారిన పడతారని తాజా అధ్యయనంలో తేలింది. ఈ మేరకు బ్రిటన్‌లోని బ్రిస్టల్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తెలిపారు. ఎలుకలపై నిర్వహించిన అధ్యయన ఫలితాల ఆధారంగా పరిశోధకులు ఈ విషయాలను వెల్లడించారు.